సాక్షి రంగారెడ్డి

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



బార్‌లో కల్తీమద్యం

ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపి అందజేస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 10లో▸



హామీలు అమలు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. 10లో▸



ఇది సర్కారు వారి భూమి

పేదలకు పంచిన సీలింగ్ భూములను ఎవరు కొన్నా ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని తహసీల్దార్ తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



కొత్తకుర్మ సత్తయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తుర్కయంజాల్: రైతులందరికీ వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయడంతో పాటు, రుణమాఫీ చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడుతూ.. క్రాప్ లోన్, ఎల్‌టీ లోన్ పెంచాలని, 55 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు పింఛన్ ఇవ్వాలని కోరారు. రైతులకు కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు ఎస్.బాల్ రెడ్డి, జంగారెడ్డి, బాలరాజు, బాలయ్య, శ్రీనివాస్, ప్రణీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే



పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా ప్రభుత్వం భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నట్‌రాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు తదితరులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలిశారు.

భూ భారతిపై నందిగామలో అవగాహన సదస్సు నేడు

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతిపై మండల కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వర్ తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోని ప్రిన్స్ ప్యాలెస్ ఆవరణలో మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

తుర్కయంజాల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీందర్ రెడ్డి

తుర్కయంజాల్: మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి పది రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో పెద్ద అంబర్‌పేట కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టి.శ్రీదేవి ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో రవీందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా జడ్జికి సత్కారం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణకుమార్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన కరుణకుమార్‌ను ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు విజయ్‌కుమార్, కృష్ణ, గణేశ్, ఆంజనేయులు, శిరీష్, బిక్యానాయక్ తదితరులు ఉన్నారు.

కారెనుక.. కారుగట్టి



కడ్తాల్: గిరిజన తండాల్లో వాల్‌పోస్టర్ల ద్వారా సభకు సన్నద్ధం చేస్తున్న పార్టీ నేతలు

రేపు ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ

- గ్రేటర్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ
- ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది
- 1,200 బస్సులు సహా 1,500కు పైగా కార్లు సిద్ధం
- సమన్వయం చేస్తున్న పార్టీ ప్రధాన నేతలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా : వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు గ్రేటర్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ చేయాలని పార్టీ నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం ఐదు వేల మందిని తరలించాలని తీర్మానించింది. ఈ మేరకు ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు 1,200 బస్సులు సహా మరో 1,500కుపైగా కార్లను కేటాయించింది. అధిష్టానం ఈ బాధ్యతను మాజీ మంత్రులు మహ్మద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, సబితారెడ్డి, చామకూర మల్లారెడ్డి, హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు అప్పగించింది. ఇప్పటికే వీరంతా ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేసి, మున్సిపాలిటీ, కార్పొరేషన్, మండలం, గ్రామ పంచాయతీల వారీగా బస్సులు, కార్లు, ఇతర వాహనాలను కేటాయించారు. 'ఇంటికో జెండా.. ఊరికో బస్సు' చొప్పున గ్రేటర్ జిల్లాల నుంచి లక్ష మందిని తరలించాలని నిర్ణయించారు.

పురుషులనే ఎక్కువగా తరలించాలని..

భగ్గున మండుతున్న ఎండల నేపథ్యంలో మహిళలు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పురుషులనే ఎక్కువగా తరలించాలని భావిస్తున్నారు. ఈ మేరకు కార్యకర్తలను, అభిమానులను సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం, క్యాంపు ఆఫీసుల నుంచి ర్యాలీగా బయలుదేరనున్నారు. ఎవరికి వారు ఆయా సమీప మార్గాల నుంచి ఔటర్ మీదుగా ఘట్‌కేసర్ జంక్షన్‌కు చేరుకోనున్నారు. అటు నుంచి భారీ ర్యాలీగా వరంగల్ బయలుదేరనున్నారు. సభకు వచ్చే ముఖ్య నాయకులు, కార్యకర్తలకు తాగునీరు, భోజన వసతి కల్పించనున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు టూరిస్ట్ బస్సులతో పాటు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సంబంధించిన ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల బస్సులను కేటాయించారు.

25 ఏళ్లు..ఎన్నో ఆటుపోట్లు

1969 తెలంగాణ తొలి దశ ఉద్యమం తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండాగా 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) ఆవిర్భవించింది. కేసీఆర్ సహా ఆచార్య జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆలే నరేంద్ర, గాదె ఇన్నయ్య తదితరులు మలిదశ తెలంగాణ ఉద్యమానికి అంకురార్పణ చేశారు. ఆ తర్వాత 2003 ఏప్రిల్ 27న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ వేదికగా ×తెలంగాణ గర్జన¥ పేరుతో ద్వితీయ వార్షికోత్సవ సభను నిర్వహించారు. 2001 నుంచి 2014 వరకు టీఆర్‌ఎస్ (ఇప్పుడు బీఆర్‌ఎస్) అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. అప్పటి వరకు ఒక్క సికింద్రాబాద్ (పద్మారావు గౌడ్) మినహా గ్రేటర్‌లో ఒక్క సీటూ గెలవలేకపోయింది. ఆ సమయంలో తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంది. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల పోరు గర్జనతో కేంద్రం స్పందించింది. డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణ ప్రకటన చేసింది. కొందరి అభ్యంతరాలతో డిసెంబర్ 23న కేంద్రం మళ్లీ వెనక్కి తగ్గింది. 2011 మార్చి 10న ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్, ఆ తర్వాత సకల జనుల సమ్మె, ఉద్యోగుల సహాయ నిరాకరణ వంటి వరుస ఆందోళనలతో చివరకు కేంద్రం దిగొచ్చింది.

గ్రేటర్‌లో అనేక అభివృద్ధి పనులు

2014 ఫిబ్రవరిలో తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది, జూన్ 2న ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. అప్పటివరకు గ్రేటర్ జిల్లాల్లో పార్టీకి పెద్దగా బలం లేదు. 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీడీపీ, కాంగ్రెస్ నుంచి భారీగా పార్టీలోకి వలసలు పెరిగాయి. మెజారిటీ ఎమ్మెల్యే సీట్లు సహా గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 2018 నాటికి మరింత బలపడింది. పదేళ్లు అధికారంలో ఉండి గ్రేటర్‌లో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికల్లో ఎల్బీనగర్, మహేశ్వరం, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో గెలుపొందింది. రూరల్ జిల్లాలతో పోలిస్తే.. గ్రేటర్ జిల్లాల్లోనే పార్టీకి అత్యధిక సీట్లు వచ్చాయి. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి, భారీగా నిధుల కేటాయింపుల పేరుతో రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. ముఖ్య నేతలు పార్టీ మారినా.. కేడర్ మాత్రం కేసీఆర్ నాయకత్వాన్నే నమ్ముకుని పని చేస్తోంది.



• విస్తరణతో తొలగి.. మోడులుగా మిగిలి

వందల ఏళ్ల నాటి మహా వృక్షాలకు విజయవాడ జాతీయ రహదారి విస్తరణ గండంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారికి ఇరువైపులా నీడనిచ్చే చెట్లను తొలగించి మరోచోట నాటించారు. చెట్ల కొమ్మలతో గుబురుగా పచ్చగా ఉన్న చెట్లు కాస్త.. నేడు మొండి మొద్దులుగా దర్శనమిస్తున్నాయి. పెద్దఅంబర్‌పేట ఔటర్ రోడ్డు నుంచి బలిజగూడకు వెళ్లే దారిలో నిర్వహణ లోపంతో ఇలా కనిపించాయి. – అబ్దుల్లాపూర్‌మెట్

భూ భారతి చట్టం ఎంతో మేలు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆమనగల్లు: భూ భారతి చట్టం–2025 ద్వారా రైతులు, పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఈ చట్టంతో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉంటుందని చెప్పారు. పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో శుక్రవారం భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం 2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి చట్టంతో భూమి హక్కులు పరిరక్షించబడతాయని తెలిపారు. ధరణితో ప్రజలు అధికారుల వద్దకు వచ్చారని, భూ భారతి చట్టంతో అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని ఆయన స్పష్టం చేశారు. త్వరలో గ్రామ రెవెన్యూ అధికారులు, అన్ని మండలాలకు సర్వేయర్ల నియామకం జరుగుతుందన్నారు. భూభారతి ద్వారా 90 శాతం సమస్యలు స్థానికంగానే పరిష్కారమవుతాయని వివరించారు. రైతులకు అన్యాయం జరిగితే ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిల్లో అప్పీల్ చేసుకోవచ్చన్నారు. వచ్చే నెలలో గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ లలిత, ఆమనగల్లు మార్కెట్‌చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, వైస్ చైర్మన్ సత్యం, ఎంపీడీఓ కుసుమమాధురి, ఏడీఏ శోభారాణి, ఏఓ అరుణకుమారి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంఈఓ పాండు, ఎస్ఐ వెంకటేశ్ పాల్గొన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డి

భూ భారతితో భూ హక్కుల పరిరక్షణ

మాడ్గుల: భూ భారతి చట్టంతో భూమి హక్కులు పరిరక్షించబడతాయని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం తహసీల్దార్ వినయ్ సాగర్ అధ్యక్షతన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో భూ సమస్యలన్నీ సత్వరం పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. దీనిపై మే 1 నుంచి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అహో.. అంబేడ్కర్..

బాబాసాహెబ్ జీవిత విశేషాలను సమున్నతంగా చాటేలా..

- మహా విగ్రహం వద్ద మ్యూజియం, స్మారక గ్రంథాలయం
- ప్రైవేట్ సంస్థలు నిర్వహించేలా హెచ్ఎండీఏ సన్నద్ధం
- కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఆసక్తుల వ్యక్తీకరణకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మ్యూజియం, స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సన్నాహాలు చేపట్టింది. నెక్లెస్‌రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ మహా విగ్రహం వద్ద రాజ్యాంగ స్ఫూర్తిని చాటేలా.. పార్లమెంట్ భవనాన్ని తలపించేలా.. విశాలమైన వేదికను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ భవనంలోనే అంబేడ్కర్ జీవిత విశేషాలను సమున్నతంగా ఆవిష్కరించేందుకు మ్యూజియం, లైబ్రరీలతో పాటు అంబేడ్కర్ జీవితంపై రూపొందించిన చిత్రాలను ప్రదర్శించాలని అప్పట్లో ప్రతిపాదించారు. అంబేడ్కర్ రచనలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలను రూపొందించారు. కానీ అప్పటి బీఆర్‌ఎస్ హయాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించినప్పటికీ మ్యూజియం, లైబ్రరీ తదితర సదుపాయాలను ప్రారంభించలేదు. పైగా అప్పటి నుంచి ఇప్పటి వరకు సందర్శకులను కూడా అనుమతించడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహం వద్ద మ్యూజియం, మెమోరియల్ లైబ్రరీ, ట్రాన్సాక్షన్ అడ్వైజరీ, క్యూరేషన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ తదితర నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు హెచ్ఎండీఏ అధికారులు ఆసక్తి గల కన్సల్టెన్సీల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ)లను ఆహ్వానించారు. 8 నెలల్లో ఈ మ్యూజియం, లైబ్రరీలను వినియోగంలోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు. అంబేడ్కర్ మహా విగ్రహ ప్రాంగణాన్ని రాజకీయ, వైజ్ఞానిక కేంద్రంగా తీర్చిదిద్దన్నారు. అంబేడ్కర్ బాల్యం నుంచి చివరి వరకు జీవిత విశేషాలను చాటేలా ఆడియో సౌండ్ సిస్టంతో పాటు లైటింగ్ షోను ఏర్పాటు చేయనున్నారు. మహా విగ్రహం, మ్యూజియంపై ప్రత్యేక వెబ్ సైట్‌ను రూపొందించే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం ఈ తరహా మ్యూజియంలు విజయవాడ, పుణె, చెన్నై, ఢిల్లీ నగరాల్లో ఉన్నాయి. హెచ్ఎండీఏ అధికారులు విజయవాడ, పుణెలోని మ్యూజియంలను సందర్శించి అధ్యయనం చేశారు. త్వరలో ఢిల్లీ మ్యూజియంను కూడా పరిశీలించనున్నట్లు సమాచారం.

'గృహజ్యోతి'లో చేతివాటం తగదు

తాండూరు టౌన్: గృహజ్యోతి పథకం సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తాండూరులోని ఏడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గృహజ్యోతి పథకం కింద పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, విద్యుత్ సిబ్బంది అధిక రీడింగ్ చూపించి, బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంటికి కొత్త మీటర్ పెట్టాలంటే రూ.8 వేలు చెల్లించాలని వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్లకు జీరోబిల్లు ఇవ్వాల్సిన విద్యుత్ సిబ్బంది, అధిక రీడింగ్ తీసి బిల్లు చెల్లించమనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గృహజ్యోతి పథకం సక్రమంగా కొనసాగేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, సతీష్ పాల్గొన్నారు.

సాగులో ఏఐ వినియోగంపై అవగాహన ఒప్పందం

- ముందుకువచ్చిన ఏజీ వర్సిటీ, బిట్స్ పిలానీ సంస్థలు



అవగాహన ఒప్పంద పత్రాలను చూపిస్తున్న సంస్థల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని అగ్రి హబ్‌లో జరిగిన కార్యక్రమంలో పీజేటీఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై ఇరు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. పరస్పరం ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మకమైన సంస్థల మధ్య జరిగిన అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందని బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌రావు అన్నారు. ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి నాణ్యమైన పరిశోధనా పత్రాలు ప్రచురించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. దుబాయ్‌తో పాటు దేశంలోని నాలుగు చోట్ల బిట్స్ క్యాంపస్‌లు ఉన్నాయని, అందులో ప్రతి ఏటా సుమారు 600 మంది పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. బిట్స్ పిలానీ సంస్థకు దేశంలోనే మూడో అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టార్టప్ నెట్‌వర్క్ ఉందని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిజ్ఞానం (హార్డ్‌వేర్), బిట్స్ పిలానిలోని సాఫ్ట్‌వేర్ కలిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు ఉపకులపతి జానయ్య తెలిపారు. ఇందులో భాగంగా ముందుగా పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుకు ఉపయోగపడే అగ్రి రోబోల రూపకల్పన జరగాలని జానయ్య ఆకాంక్షించారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం అవగాహన ఒప్పందం ముఖ్య లక్ష్యాల గురించి సమావేశంలో వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, బిట్స్ పిలాని డీన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డాక్టర్ సంకేత్ గోయల్, పీజేటీఏయూ అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డాక్టర్ రాములు, డిజిటల్ అగ్రికల్చర్ సంచాలకులు డాక్టర్ బాలాజీనాయక్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బిట్స్ పిలానీ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఉగ్రదాడిపై నిరసనగళం

పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల ముస్లింలు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో హిందూ, ముస్లింలు సోదరుల్లా కలిసి ఉన్నారని, దీన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఉగ్రవాదులు కుట్రలు పన్నారని పలువురు నేతలు అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



ఇబ్రహీంపట్నం: అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన ర్యాలీ

ఉగ్రవాదం అణచివేతలో కేంద్రం విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

షాబాద్: పహల్గాం ఉగ్రవాదదాడిలో పర్యాటకులు మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుర్వగూడ, మన్మర్రి గ్రామాల్లో సీపీఐ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదానికి కులం, మతం, జాతి ఉండదని మానవ మృగాల్లాగా మానవజాతిని అంతం చేయడమే లక్ష్యంగా పనిచేసే ఉగ్రవాదాన్ని ప్రపంచ దేశాలు ముక్తకంఠంగా ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. దాడిలో పాల్గొన్న ఉగ్రవాద సంస్థల కదలికలను పసిగట్టడంలో కేంద్ర నిఘా వర్గాలు తీవ్రంగా విఫలం చెందాయన్నారు. ఉగ్రవాద దాడిలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు ప్రాణాలు కోల్పోయారని.. బీజేపీ నాయకులు సోషల్ మీడియా ద్వారా ఇది హిందువుల మీద జరిగిన దాడిగా చిత్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, తదితరులున్నారు.

కుర్వగూడ, మన్మర్రి సీపీఐ గ్రామ శాఖల నూతన కమిటీల ఎన్నిక

సీపీఐ శాఖ మన్మర్రి, కుర్వగూడ కార్యదర్శులుగా వెంకటయ్య, శ్రీనివాస్ సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, రాజు, మన్మర్రి కోశాధికారిగా నాగేష్, కమిటీ సభ్యులుగా బాలమణి, లక్ష్మమ్మ, శంకరయ్యను ఏకగ్రీవంగా నియమితులయ్యారు.



మాట్లాడుతున్న డీఎస్పీ హరీశ్‌చంద్రారెడ్డి

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

డీఎస్పీ హరీశ్‌చంద్రారెడ్డి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని డీఎస్పీలు హరీశ్‌చంద్రారెడ్డి, సుబ్బరామిరెడ్డి అన్నారు. శుక్రవారం జేబీఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆర్కిటెక్చర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎస్పీలు హరీశ్‌చంద్రారెడ్డి, సుబ్బరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య విద్యార్థికి బంగారు భవిష్యత్ అందిస్తుందన్నారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తెచ్చేలా ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగిన్‌పల్లి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, ఆర్కిటెక్చర్ ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ శర్మ, మెడికల్ కళాశాల సీఏఓ మాజీ డీఎస్పీ యాదయ్య, వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌మూర్తి, యాంటీ ర్యాగింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, రమేష్, యాంటీ డ్రగ్ కోఆర్డినేటర్ ప్రత్యూష, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ గంగారామ్, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బార్‌లో కల్తీమద్యం

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు
- ప్రీమియం మద్యం బాటిళ్లలో తక్కువ ధర మద్యంతో కల్తీ
- రూ.1.48 లక్షల విలువైన కల్తీమద్యం పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఓ బార్ కల్తీ మద్యం విక్రయాలకు తెరలేపింది. ఖరీదైన ప్రీమియం మద్యం బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపి వినియోగదారులకు అందజేస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. లింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ట్రూప్స్ బార్‌ను కొంతకాలంగా లైసెన్స్ పునరుద్ధరించకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు రంగారెడ్డి ఏఈఎస్ జీవన్ కిరణ్ ఎక్సైజ్ సిబ్బందితో కలిసి శుక్రవారం బార్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బార్‌లోని పనిచేసే కూకట్‌పల్లికి చెందిన సత్యనారాయణ, పునిక్ పట్నాయక్‌లు కలిసి ఖరీదైన మద్యం బాటిళ్ల సీల్ తీసి తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని వాటిలో కలుపుతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.2690 ధర కలిగిన జేమ్సన్ బాటిళ్లలో రూ.1000 ధర కలిగిన ఓక్‌స్మిత్ మద్యాన్ని కలుపుతున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. ఇలా వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన 75 మద్యం బాటిళ్లను, 55 ఖాళీ బాటిళ్లను ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా ట్రూప్ బార్ లైసెన్స్ ఫీజ్ చెల్లించకపోవడమే కాకుండా మద్యం డిపోల నుంచి మద్యం కొనుగోలు చేయడం లేదని అధికారులు తెలిపారు. డిపోల నుంచి కొనుగోలు చేయడానికి బదులు వైన్ షాపుల నుంచి కొనుగోలు చేసి ఎక్కువ ధర కలిగిన బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలుపుతూ అమ్మకాలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ విచారణలో వెల్లడైంది. మొత్తం రూ.1.48 లక్షల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. బార్ యజమాని ఉదయ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ వి. సత్యనారాయణరెడ్డి, బార్‌లో పనిచేసే ఉద్యోగి పునిత్ పట్నాయక్‌లపైన కేసు నమోదు చేసినట్లు ఏఈఎస్ జీవన్ కిరణ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

శంకర్‌పల్లి: ఓ కార్మికుడు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన మడకామి(23) బతుకుదెరువుకు వలస వచ్చాడు. ఆయనకు భార్య, కొడుకు ఉన్నారు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన కేఎంఎల్ కన్‌స్ట్రక్షన్స్‌లో గురువారం 8వ అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారు పరిస్థితి విషమంగా ఉందని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లమని సూచించారు. ఈ క్రమంలో ఆయన మార్గమధ్యలోనే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: 'మనూ'లో పాలిటెక్నికల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చివరి తేదీని మే13 గా నిర్ణయించినట్లు 'మనూ' హైదరాబాద్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. ఉర్దూ మాధ్యమం నుంచి లేదా పదవ లేదా 12వ స్థాయిలో ఉర్దూను ఒక సబ్జెక్టు ఆప్షనల్‌గా చదివిన విద్యార్థుల కోసం నాలుగు డిప్లొమా కోర్సుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 98853 80534, 9032394813 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పౌల్ట్రీకి మళ్లీ మంచి రోజులు

పౌల్ట్రీ ఫెడరేషన్ జాతీయ నాయకుడు కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వరుస సంక్షోభాల నుండి తేరుకుని పౌల్ట్రీ రంగానికి మంచి రోజులు వస్తున్నాయని, అందుకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా దోహదం చేస్తున్నాయని పౌల్ట్రీ ఫెడరేషన్ జాతీయ నాయకులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా విధానంలో తీసుకువచ్చిన మార్పులు పౌల్ట్రీరంగానికి ఊతం ఇవ్వనున్నాయని చెప్పారు. బర్డ్ ఫ్లూని అధిగమించామని, దేశానికి అన్ని రకాల పౌల్ట్రీ ఉత్పత్తులను అందించటంలో తెలంగాణను నెంబర్‌వన్ స్థానంలో ఉంచుతామన్నారు. తమకు పూర్తి సహకారం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ, ఎక్విప్‌మెంట్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో త్వరలో కలిసి కృతజ్ఞతలు తెలుపుతామని కసిరెడ్డి పేర్కొన్నారు.

ఇది సర్కారు వారి భూమి

- కొనుగోలుదారులకు నోటీసులు అందజేసిన రెవెన్యూ అధికారులు
- సీలింగ్ భూముల్లో బోర్డుల ఏర్పాటు



ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

ధారూరు: పేదలకు పంచిన సీలింగ్ భూములను ఎవరు కొనుగోలు చేసినా ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని తహసీల్దార్ సాజిదాబేగం అన్నారు. సీలింగ్, అసైన్డ్ భూములను ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని, ఎవరైనా తమకు ఫిర్యాదు చేస్తే సదు భూములను వెనక్కి తీసుకుంటామని స్పష్టంచేశాఉ. మండల కేంద్రంలోని 197/4, 197/5 సర్వేనంబర్లలోని 4.08 ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్ ఆదేశం మేరకు శుక్రవారం ఆర్ఐ స్వప్న, అసిస్టెంట్ ఆర్ఐ అంజలి, సర్వేయర్ శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది కలిసి సదరు భూములను పరిశీలించారు. ఇందులో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతారు.

ఏం జరిగిందంటే..

ధారూరుకు చెందిన పత్తి అమృతమ్మకు, చాకలి శంకరయ్యకు ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ కింద 2.04 ఎకరాల చొప్పున భూమిని పంపిణీ చేసింది. వీరి నుంచి అవుసుపల్లి లక్ష్మి సెప్టెంబర్, 0226లో 2.04 ఎకరాలు, శెట్టి లలితాదేవి నవంబర్ 2, 2008లో 2.04 ఎకరాలు కొనుగోలు చేశారు. అయితే తనకు, తమ పిల్లకు తెలియకుండానే తన భర్త శంకరయ్య సీలింగ్ భూమిని విక్రయించారని, దీన్ని తిరిగి ఇప్పించాలని ఇటీవల భూమి విక్రేత కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు పీఓటీ చట్టం 1977 కింద కొనుగోలుదారులకు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం సదరు భూమిలో బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భూముల్లో వరి సాగు చేశారని, పంట కోత అనంతరం ఎవరూ ఇందులోకి వెళ్లకూడదని తహసీల్దార్ ఆదేశించారు.

హామీలు అమలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి



గ్రామసభలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అంతారంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రామస్వామి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అధికారంలో ఉన్న 11 ఏళ్లలో కోటి ఉద్యోగాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ తీరును మార్చుకుని పేదలకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి జయమ్మ, సహాయ కార్యదర్శి లక్ష్మి, నాయకులు అమృత, నరసింహ, చంద్రయ్య, గంగమ్మ, పద్మమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవకాడో కొనాలనుకుంటే..

అడ్డంగా దోచేశారు!

- హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్‌లో అవకాడో ఫలాలు ఖరీదు చేయాలని భావించిన నగర యువకుడు రూ.2.6 లక్షలు నష్టపోయాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు శుక్రవారం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. నగరానికి చెందిన విద్యార్థి (23) అవకాడో ఫలాలు ఒక కేజీ ఖరీదు చేయడానికి జస్ట్ డయల్ యాప్‌లో వెతికాడు. అందులో విజయవాడకు చెందిన బాలాజీ ట్రేడర్స్ అనే సంస్థ వివరాలు దొరికాయి. కొద్దిసేపటికి ఆ సంస్థ ప్రతినిధులుగా చెప్పుకుంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము విజయవాడ నుంచి అవకాడోలు పంపిస్తామని, అడ్వాన్సుగా కేవలం ఇంధనం ఖర్చులు ఇస్తే చాలంటూ కొంత మొత్తం బదిలీ చేయించుకున్నారు. వాహనం బయలుదేరిందంటూ సమాచారం ఇచ్చారు. మరోసారి బాధితుడిని సంప్రదించిన నేరగాళ్లు వాహనం మరమ్మతుకు గురైందని చెప్పి కొంత, మీ లోకేషన్‌కు పది కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ పోలీసులు ఆపారంటూ మరికొంత బదిలీ చేయించుకున్నారు. అవకాడో సరఫరాదారుల నుంచి ఆ ఫలాలు కొంటున్నామని, జీఎస్టీగా చెల్లించాలంటూ మళ్లీ నగదు బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత మరోసారి బాధితుడిని సంప్రదించిన సైబర్ నేరగాడు 'ఇప్పటి వరకు మీరు బదిలీ చేసిన మొత్తాన్ని నా కుమారుడు దుర్వినియోగం చేశాడు' అని, తనకు మరికొంత మొత్తం అత్యవసరమని పేర్కొన్నారు. బాధితుడిని నమ్మించడానికి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ వేరే వారికి జారీ చేసినట్లు ఉన్న ఓ చెక్కు ఫొటోను పంపించారు. బ్యాంకు ఖాతా వివరాలు చెప్తే చెల్లించిన మొత్తం రిఫండ్ చేస్తామంటూ నమ్మబలికాడు. ఓ దశలో సందేహం వచ్చిన యువకుడు తన డబ్బు వెంటనే రిఫండ్ చేయమని కోరారు. దీంతో సైబర్ నేరగాళ్లు తాము డిమాండ్ చేసిన మొత్తం చెల్లించకుంటే రిఫండ్ రాదని చెప్పారు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పడానికి భయపడిన యువకుడు నగదు బదిలీ చేస్తూపోయాడు. మొత్తం రూ.2.6 లక్షలు కోల్పోయిన తర్వాత సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

అగ్గిపుడితే.. బుగ్గే.!

- గాంధీ ఆస్పత్రిలో మారని దుస్థితి
- దశాబ్ద కాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన నివేదికలు
- ఉన్న అగ్నిమాపక కేంద్రం తరలింపు
- ప్రమాదం జరిగితే హడావుడి.. అనంతరం పట్టించుకోని ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో/గాంధీఆస్పత్రి : ఎక్కడైనా ప్రమాదం జరిగినపుడు హడావుడి చేయడం.. నిధులు అవసరం అంటూ నివేదికలు తయారు చేయడం. ఆనక ఆ విషయాన్ని గాలికి వదిలేయడం గాంధీ ఆస్పత్రి అధికారులకు అలవాటుగా మారింది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ దవాఖానలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదేళ్ల నుంచి ఏటా ఫైర్ సేఫ్టీ పరికరాల కొనుగోలుకు సంబంధించి రూ.కోట్లలో ప్రతిపాదనలు పంపిస్తున్నా నేటికీ అవి అనుమతులకు నోచుకోక దస్త్రాలకే పరిమితమవుతున్నాయి.

తుప్పుపట్టిన పరికరాలు..

తెలుగు రాష్ట్రాలతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజల ఆరోగ్యప్రదాయినిగా వెలుగొందుతున్న గాంధీ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రోగులు, వారి సహాయకులు, వైద్యులు, నర్సింగ్, ఇతర సహాయక సిబ్బంది అంతా కలసి రోజుకు సుమారు 15 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. 8 అంతస్తుల్లో నిర్మించిన ప్రధాన భవనంలో 36 విభాగాలకు చెందిన ఇన్ పేషెంట్ వార్డులు ఉన్నాయి. 2003లో నిర్మించిన ప్రధాన భవనంలో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలు నిర్వహణ కొరవడి కొన్ని తుప్పుపట్టిపోగా.. మరికొన్ని దొంగతనానికి గురయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఫైర్ సేఫ్టీ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర మార్గాలు లేవు. ప్రస్తుతం ఉన్న లిఫ్టులు, మెట్ల మార్గం ఆసుపత్రి లోపలి నుంచి మాత్రమే ఉన్నాయి. ప్రమాద సమయంలో వీటిని వినియోగించలేరు. అందుకు ప్రత్యామ్నాయంగా భవనం వెలుపల నుంచి మెట్ల మార్గం, ర్యాంప్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు అలాంటివి అందుబాటులో లేవు. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. మొదటి నుంచి భవన నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం

గాంధీ ఆసుపత్రిలో ఫైర్‌సేఫ్టీకి సంబంధించిన ప్రతిపాదనలు గత పదేళ్ల నుంచి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. కొత్త పరికరాల కొనుగోళ్లకు సుమారు రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అప్పట్లో ప్రభుత్వానికి సమర్పించారు. ఆ తర్వాత దాని పర్యవేక్షణ మరిచారు. దీంతో ఆ దస్త్రాలు కాగితాలకే పరిమితమయ్యాయి. అక్కడి నుంచి సందర్భం వచ్చినపుడల్లా పదేపదే నివేదికలు అందించడం తప్ప నిధుల మంజూరుపై శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అగ్నిమాపక కేంద్రం తరలింపు

గాంధీ మెడికల్ కళాశాల, వసతి భవనాలు, ఆసుపత్రి ఐపీ, ఓపీ, పరిపాలనా భవనాలు, తదితరాలు మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఉండాలనే డిమాండ్ ఉంది. దీంతో గతంలో ఆసుపత్రి ప్రాంగణంలో తాత్కాలిక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఏదైనా సంఘటన జరిగినపుడు సిబ్బంది అప్రమత్తమయ్యేవారు. కరోనా అనంతరం ఇక్కడున్న అగ్నిమాపక కేంద్రాన్ని తరలించారు. ఇప్పుడేదైనా చిన్న సంఘటన జరిగినా సికింద్రాబాద్, చిక్కడ్‌పల్లి కేంద్రాల నుంచి వాహనాలు రావాల్సి ఉంటుంది. ఇప్పుడున్న ట్రాఫిక్‌లో అగ్నిమాపక శకటం ఆసుపత్రి ఆవరణకు చేరుకోవడానికి కనీసం 40 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. ఈ లోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా దీనిపై ఆస్పత్రి సూపరింటెండ్ డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, అవి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

2019 సంవత్సరం ఆగస్టులో అగ్నిప్రమాదం జరిగి గాంధీ ఆస్పత్రిలోని పీడియాట్రిక్ సర్జరీ ప్రిపరేషన్ వార్డు అగ్నికి ఆహుతైంది. ఆ సమయంలో పిల్లలెవరూ వార్డులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కానీ విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి.



ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



జశ్వంత్

పోచారం: ఇంటర్మీడియట్‌లో ఫెయిలైనందుకు మనస్తాపం చెందిన విద్యార్థి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం..జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన భూసి జశ్వంత్ (17) అన్నోజిగూడలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సం 90 శాతం మార్కులతో పాసైన జశ్వంత్..ద్వితీయ సంవత్సరంలో మాత్రం మూడు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీంతో మానసిక వేదనకు గురయ్యాడు. ఇటీవల నగరంలో ఉంటున్న తన మామ ఇంటికి వెళ్లి 90 శాతం మార్కులతో ఇంటర్ పాసయ్యానని చెప్పాడు. కానీ, తల్లిదండ్రులతో ఫెయిలయ్యానని ఫోన్ చేసి చెప్పాడు. ఈ క్రమంలో జశ్వంత్ బుధవారం సాయంత్రం ఉప్పల్‌లో గడ్డి మందు బాటిల్ కొనుక్కుని కాలేజ్‌కు వచ్చాడు. ఆ రోజు రాత్రి కావడంతో ఇంటికి వెళ్లడం కుదరలేదు. మరుసటి రోజు గురువారం ఉదయం 4 గంటల సమయంలో గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న కళాశాల నిర్వాహకులు సమీపంలోని హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం జశ్వంత్‌ను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం జశ్వంత్ మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యపై ఎలాంటి అనుమానాలు లేవని, ఈ విషయంలో కళాశాల యాజమాన్యంతో పాటు సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తనను హేళనగా చూడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు జశ్వంత్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడని స్నేహితులు చెబుతున్నారు.